క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


రమేశ్, తహసీల్దార్

నెన్నెల: నెన్నెల తహసీల్దార్‌గా సబ్బ రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఇమ్రాన్ ఖాన్ తాండూర్‌కు బదిలీ కాగా కుమురంభీం జిల్లా సిర్పూర్(యూ) తహసీల్దార్ రమేశ్ నెన్నెలకు బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది డీటీ ప్రకాశ్, ఆర్‌ఐ గణేశ్, మండల సర్వేయర్ వంశీకృష్ణ, సిబ్బంది కుర్షిద్‌ఆలీ, సందేశ్, జంపయ్య, రాంచందర్, గంగారాంలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మండల ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తహసీల్దార్ రమేశ్ పేర్కొన్నారు.

విధుల్లో చేరిన తహసీల్దార్, ఎంపీడీవో


కె.రమేశ్ తహసీల్దార్


దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో

వేమనపల్లి: వేమనపల్లి తహసీల్దార్‌గా కె.రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జైపూర్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. నెన్నెల ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి వేమనపల్లికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్


మురళీకృష్ణ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.మురళీకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటనారాయణ నిజామాబాద్ జిల్లా బోధన్‌కు బదిలీయ్యారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణకు ప్రమోషన్ కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేశారు.

108 వాహనం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణంలోని పీహెచ్‌సీ వద్ద 108 వాహనాన్ని క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధికారి కిశోర్, ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం సామ్రాట్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. 108 సిబ్బంది నలిగంటి సతీశ్, పైలెట్ కొడిపె మహేశ్వర్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

జన్నారం: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని కలమడుగు, మురిమడుగు, వెంకటపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజమోహన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ముందస్తుగా కేంద్రాలపై అవగాహన కోసం పరిశీలించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ భానుచందర్ ఉన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్, చైర్మన్

నస్పూర్: తమ మొక్కు తీర్చుకోవడానికి వచ్చే భక్తులకు అన్నిసౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ సతీశ్, చైర్మన్ సుర్మిల్ల వేణు పేర్కొన్నారు. సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి అధికారుల సహకారంతో మౌలిక వసతులు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక స్నానపు గదులు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, తదితర అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం డంప్‌యార్డును పరిశీలించారు. వైస్ చైర్‌పర్సన్ గెల్లు రజిత, కౌన్సిలర్లు మడిగ మల్లయ్య, బండి పద్మ తదితరులు ఉన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

తాండూర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ బృందం నివేదికలను ప్రజావేదికలో సమర్పించనున్నారు. ఈ ప్రజావేదికకు ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

సమ్మె విజయవంతం

- మద్దతు తెలిపిన అన్నివర్గాల శ్రేణులు
- పాల్గొన్న ఆటో కార్మికులు


చెన్నూర్: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

బెల్లంపల్లి: జిల్లావ్యాప్తంగా దేశవ్యాప్త సమ్మె, గ్రామీణభారత్ బంద్ శుక్రవారం విజయవంతమైంది. బెల్లంపల్లిలో సమ్మెకు అన్నివర్గాల శ్రేణుల నుంచి మద్దతు లభించింది. ఆటో కార్మికులు సంపూర్ణంగా పాల్గొన్నారు. ఇంటి వద్దనే ఆటోలు నిలిపివేయడంతో సాధారణ ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. గ్రామీణ ప్రాంతాల నుంచి బెల్లంపల్లికి కూరగాయలు తీసుకువచ్చేందుకు ఆటోలు లేక వ్యాపారులు, రైతులు అసౌకర్యానికి గురయ్యారు. శాంతిఖని గని కార్మికులు సమ్మెలో పాక్షికంగా పాల్గొనగా, సింగరేణి ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వినయ్‌కుమార్, సోకాల శ్రీనివాస్, రాజశేఖర్, శ్రవణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

సీఐటీయూ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో భారీ ర్యాలీ చేశారు. తిలక్‌స్టేడియం నుంచి బజారుఏరియా పురవీధుల మీదుగా ఎర్రజెండాలు పట్టుకుని అసంఘటిత కార్మికులు ర్యాలీ చేశారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లించాలని, ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు బేషరతుగా రద్దు చేయాలని నినదించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు గోపాల్, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క, డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవదాస్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రానికి కార్మికులు, కర్షకులు గుణపాఠం చెబుతారని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణంలోని రావిచెట్టు నుంచి కొత్త బస్టాండ్ వరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆటో యూనియన్, మహిళా సంఘాలు, కార్మిక సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, యువకులు సమ్మెలో పాల్గొన్నారు. నెన్నల సమ్మయ్య, చందు, గోపినాథ్, రమేశ్, కుమార్, శంకర్, సుమతి, రాజేశ్వరి, సమ్మక్క పాల్గొన్నారు.

జన్నారంలో..

జన్నారం: జన్నారంలో వామపక్ష పార్టీలు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీసి, రాస్తారోకో చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అశోక్, సీపీఎం నాయకులు విజయ, ప్రమీల, రాజన్న, సీఐటీయూ కార్యదర్శి బుచ్చన్న, నాయకులు లక్ష్మణ్, లక్ష్మీకాంతం, నర్సయ్య, రాజమౌళి, సంధ్య పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట: మండలంలో సమ్మె ప్రశాంతంగా ముగిసింది. మందమర్రి ఏరియా కాసిపేట గనిలో మొదటిషిఫ్టులో 659 మందికి గాను 94 మంది ఉద్యోగులు హాజరయ్యారు. రెండో షిఫ్టులో 262 మందికి 55 మంది ఉద్యోగులు హాజరుకావడంతో ఉత్పత్తిపై ప్రభావం చూపింది. కాసిపేట–2 గనిలో మొదటిషిఫ్టులో 406 మందికి 72 మంది ఉద్యోగులు, రెండో షిఫ్టులో 137 మందికి 24 మంది ఉద్యోగులు హాజరయ్యారు. యూనియన్లు ఒత్తిడి చేయకున్నా కార్మికులు స్వచ్ఛందంగా ఇళ్లల్లో ఉండిపోయారు. దీంతో ఉత్పత్తిపై సమ్మె ప్రభావం కనిపించింది. ఎస్సై గంగారాం ఆధ్వర్యంలో గనులపై బందోబస్తు నిర్వహించారు. సోమగూడెంలో ఆటోడ్రైవర్లు సమ్మెకు మద్దతు తెలిపారు.

బొగ్గు బ్లాకులు వేలం నిలిపివేయాలి

కాసిపేట: కేంద్రప్రభుత్వం సింగరేణిలో బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేసి సంస్థకు కేటాయించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమగూడెంలో సమ్మెకు మద్దతుగా నిరసన తెలిపారు. బ్రాంచి సహాయ కార్యదర్శి తిరుపతిగౌడ్, కాసిపేట గని ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, పోశం, రమేశ్, రాజేందర్, నరేందర్, రఘురాం, భాస్కర్, రాంకొమురయ్య ఉన్నారు.

మందమర్రిలో..

మందమర్రిరూరల్: దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా కార్మిక సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక సాయిబాబా ఆలయం వద్ద గల అంబేద్కర్ కూడలి వద్ద ఏఐటీయూసీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కాగా, పట్టణంలో ఆటో యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా ఆటోడ్రైవర్లు శుక్రవారం నిరసన తెలిపారు.

భీమినిలో..

భీమిని: ఖర్జీభీంపూర్‌లో రైతు కూలీ సంఘం నాయకులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. నాయకుడు రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు రత్నం తిరుపతి పాల్గొన్నారు.

జైపూర్‌లో..

భీమారం: జైపూర్ పవర్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విక్రమ్,వర్కింగ్ ప్రసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శి సాయికృష్ణరెడ్డి, సంపత్, రమేశ్ పాల్గొన్నారు.



కాసిపేట: ఏఐటీయూసీ నాయకుల నిరసన


దండేపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో..

భీమారంలో..

భీమారం: మండలకేంద్రంలోని ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఫక్రోద్దీన్ ఉన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: స్థానిక గాంధీచౌక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు. మండల కన్వీనర్ శోభ, జిల్లా ధ్యక్షులు దాసరి సురేష్, పంచాయతీ కార్మికులు, ఆశవర్కర్లు, ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్ట వ్యతిరేక విధానాలను విడనాడాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని బీపీఏ ఓసీపీ–2 ఆవరణలో శుక్రవారం నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, రాజిరెడ్డి, రాఘవరెడ్డి, వెంకటేశ్, రవిశంకర్, సత్తయ్య, నరేశ్ పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పంచాయతీ కార్మికులతో పాటు, అంగన్‌వాడీలు పాల్గొని నిరసన తెలిపారు.


బెల్లంపల్లిలో ర్యాలీ తీస్తున్న సీఐటీయూ శ్రేణులు


లక్సెట్టిపేటలో సీఐటీయూ నాయకుల ర్యాలీ


జైపూర్‌లో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు


మందమర్రిరూరల్: ఏఐటీయూసీ నాయకుల నిరసన


జన్నారం: ర్యాలీ తీస్తున్న సీపీఎం నాయకులు


సోమగూడెంలో మద్దతు ప్రకటిస్తున్న ఆటోడ్రైవర్లు


తాండూర్: ఐఎన్‌టీయూసీ నాయకుల నిరసన



ఖర్జీభీంపూర్‌లో నాయకుల ర్యాలీ

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు


ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణం

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి శివారులోని 322, 323 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురై రాత్రికి రాత్రే నిర్మాణాలు జరుగుతున్నాయి. స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈవిషయమై ఈనెల 9న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుందని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తుడు ఆసంపల్లి శేషుకుమార్ తెలిపారు. అక్రమ నిర్మాణంపై శుక్రవారం మంచిర్యాల కలెక్టర్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

మాలభవన్ ఏర్పాటు చేయాలని వినతి


ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం ఇస్తున్న మాలమహానాడు నాయకులు

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లో మాలభవన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి శుక్రవారం హైదరాబాద్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మాలభవన్ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ ఉపాధ్యక్షుడు ముత్యమాల పుల్లయ్య, కార్యదర్శి కాసర్ల యాదగిరి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా చంద్రకుమార్


చంద్రకుమార్

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట ఎస్సైగా చంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మందమర్రి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన లక్ష్మణ్ బదిలీపై రామగుండం వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి స్థానిక పోలీసులు సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

బీజేపీ జాతీయ సమావేశాలకు రావాలని ఆహ్వానం

చెన్నూర్: ఢిల్లీలోని ప్రగతి మైదానంలో ఈనెల 17, 18 తేదీల్లో జరిగే బీజేపీ జాతీయ సమావేశాలకు రావాలని పట్టణానికి చెందిన ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. మూడోసారి తనకు ఆహ్వానం అందడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

పీఎస్సార్‌కు మంత్రి పదవి రావాలని ప్రార్థనలు


ప్రార్థనలో పాల్గొన్న మత పెద్దలు

నస్పూర్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు (పీఎస్సార్)కు మంత్రి పదవి రావాలంటూ సీసీసీ ఆర్కే 5 కాలనీలోని జమా మసీదులో ముస్లిం సోదరులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జమా మసీదు అధ్యక్షుడు మహ్మద్ మౌలానా మాట్లాడుతూ గతంలో ప్రేంసాగర్‌రావు చేసిన కృషి ఫలితంగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బలపడిందని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో ఆయన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ఆయనకు మంత్రి పదవి రావాలని ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ఇమామ్ ముఫ్తీ మహ్మద్ ఇమ్రాన్, పలువురు మతపెద్దలు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

మంచిర్యాలటౌన్: దేశవ్యాప్త ససమ్మెలో భాగంగా శుక్రవారం పారామెడికల్ జేఏసీ తరఫున అన్ని పీహెచ్‌సీల్లో నల్లబ్యాడ్జీలను ధరించి సంఘీభావం తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పారామెడికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అల్లాడి శ్రీనివాస్, సలహాదారు రామ్మూర్తి, సుష్మ, శ్రీనివాస్, సరిత, అపర్ణ, అనసూయ, రాజ్‌కుమార్‌లు నల్లబ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఓయూ జేఏసీ నాయకులు


వేమనపల్లి: మెగా డీఎస్సీలో భాగంగా జీవో నంబర్ 97 ద్వారా 1523 ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని ఓయూ జేఏసీ నాయకుడు దుర్గం మల్లేశ్, హైకోర్టు అడ్వకేట్ జాజిమొగ్గ గణేశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఓయూ జేఏసీ నాయకులు తదితరులు ఉన్నారు.

• యోగా విన్యాసాలు



మందమర్రిరూరల్: రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మందమర్రి యోగా క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా విన్యాసాలతోపాటు సూర్య నమస్కారాలు చేశారు. యోగా మాస్టర్ శంకర్, క్లబ్ సభ్యులు కొంపెల్లి రమేశ్, సదానందం, మార్కండేయ, యశ్వంత్, రాజమణి, శ్రీదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన


కుంగిన వంతెన దిమ్మెలు

జన్నారం: కడెం ప్రధాన కాల్వపై 40 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. నిత్యం రాకపోకలు సాగించే వంతెన ఎప్పు డు కూలుతుందో తెలియని పరిస్థితి. మండలంలోని ఇందన్‌పల్లి సమీపం నుంచి కడెం ప్రధాన కాల్వ ప్రవాహం జరుగుతోంది. ఇందన్‌పల్లి గ్రామస్తులు కాల్వ దాటి వెళ్లడానికి అప్పట్లో వంతెన నిర్మించారు. కడెం ప్రాజెక్టు సమయంలో నిర్మించిన వంతెన ప్రస్తుతం ఇరువైపులా దిమ్మెలు కుంగి, పిల్లర్ దెబ్బతింది. కూలే ప్రమాదం ఉండడంతో ఇందన్‌పల్లి గ్రామస్తులు కాల్వ దాటి మరోదారి గుండా, దేవునిగూడ, కవ్వాల్‌కు వెళ్లేందుకు వీలు ఉంది. నిత్యం వంతెన పై ఎడ్లబండ్లు, బైక్‌లు రాకపోకలు జరుగుతాయి.

ప్రతిపాదనలు పంపిస్తాం

వంతెన శిథిలావస్థలో ఉన్న విషయం మా దృష్టికి రావడంతో పరిశీలించాం. కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపుతాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రాజు, ఏఈఈ ఇరిగేషన్

బురద తొలగించరూ..



భీమారం: భీమారం సమీపంలో గొల్లవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ పక్కనే రోడ్డుపై వ్యర్థాలు పడేస్తున్నారు. దాంతో బురదగా మారడంతో రైతుల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాలను అధికారులు తొలగించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. బురద, వ్యర్థాలతో ఉన్న రోడ్డుపై ఎడ్లబండి, ద్విచక్రవాహనాలు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది. తమ పొలాల వద్దకి వెళ్లని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని వారు కోరుతున్నారు.

చిన్న రోడ్డు ..పెద్ద వాహనాలు



చెన్నూర్: మున్సిపాలిటీ ఏర్పడినా చిన్న రోడ్ల సమస్య తీరలేదు. పాత బస్టాండ్ నుంచి చెరువుకట్ట వరకు వెళ్లే ప్రధాన రోడ్డు చిన్నగా ఉంది. పెద్ద వాహనాలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పాత బస్టాండ్ నుంచి చెరువుకట్ట వరకు నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.